క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వెస్టన్‌హిల్స్ ఫీడర్ పరిధిలోని వెస్టన్ హిల్స్, అడ్డగుట్ట ప్రాంతాల్లోని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

- జలవాయు విహార్ ఫీడర్ పరిధిలోని అడ్డగుట్ట, ప్రతిమ హాస్పిటల్ వెనుక పక్కన, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మాధవినగర్, జయనగర్ ఫీడర్ పరిధిలో..

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ వైర్లకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలు నరికివేత కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఆల్విన్ కాలనీ ఏఈ శరత్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మాధవినగర్ ఫీడర్, జయనగర్ ఫీడర్ పరిధిలోని విజయనగర్ కాలనీ, నవోదయ కాలనీ, శుభోదయాలనీ, మాధవినగర్‌లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

బోర్‌వెల్స్‌కు మరమ్మతులు చేపట్టాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బోర్‌వెల్స్ పనిచేయటం లేదని బుధవారం కార్పొరేటర్ సబిహా బేగం జలమండలి జీఎం ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వెంటనే స్పందించిన ఆయన ఎలక్ట్రికల్ మేనేజర్ సుప్రజకు మరమ్మతు పనులను తక్షణమే చేపట్టాలని ఆదేశించారన్నారు.

కళ్లద్దాల పంపిణీ

కూకట్‌పల్లి: ముమ్మారెడ్డి ప్రేమకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూసాపేట డివిజన్‌లో ఉచిత కళ్ల అద్దాల పంపిణీ కార్యక్రమం జరిగింది. భారత ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పరిపాలనలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో పలు డివిజన్లలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేసుకున్న వారికి బుధవారం మూసాపేట డివిజన్‌లో కళ్లద్దాలు అందజేశారల్లీ కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ మహేందర్, నాయకులు పద్మయ్య, వినోద్, డివిజన్ అధ్యక్షుడు మనోహర్, తూము శైలేష్, సాయిరామ్, కిషోర్, బీజేవైఎం సాయి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోండి



జెడ్‌సీ మమతకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ 4వ ఫేజ్‌లో ఆర్టీవో కార్యాలయం పక్కన ఎల్‌ఐజీ ప్లాట్స్ 20, 21 పక్కన ఉన్న పార్కు స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు బుధవారం జెడ్‌సీ మమతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కంటెస్టెంట్ కార్పొరేటర్ ప్రీతంరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గంధంరాజు, నాయకులు సుగుణమ్మ, తోట రమేష్, రవినాథ్, మహమ్మద్ హుస్సేన్, మహేందర్, నర్సింలు, భాస్కర్, శ్రీహరి పాల్గొన్నారు.

మారియట్‌లో మిల్లెట్ ఫుడ్

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంగా ఐరాస ప్రకటించిన నేపథ్యంలో ఐటీసీ హోటల్స్‌కు చెందిన మారియట్ హోటల్స్‌లో మిల్లెట్ ఆహారం ప్రత్యేక మెనూ అందిస్తున్నట్లు నగర ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. మల్టీ మిల్లెట్ అండ్ టర్మరిక్ లూఫ్, పెర్ల్ మిల్లెట్ ఫోకస్సియా, ఫాక్స్‌టైల్ మిల్లెట్ అండ్ కేరెట్ బ్రెడ్ తదితర బ్రెడ్స్‌తో పాటు ఫింగర్ మిల్లెట్, జాగరీ పాన్ కేక్, రాగి ఫ్లోర్ ఖాండ్వీ, జాక్ ఫ్రూట్ మిల్లెట్ హలీమ్, పెర్ల్ మిల్లెట్ రిసొట్టో విత్ ప్రాన్స్, పికిల్డ్ టమాటో, చికెన్, పెర్ల్ మిల్లెట్ ఈ మెనూలో అందిస్తున్నామని వివరించారు.

ఉచిత న్యాయ సేవలపై అవగాహన

అమీర్‌పేట: న్యాయ పరిష్కారం కోసం కోర్టులకు వెళ్లలేని వారికి ఉచితంగా న్యాయ సేవలు పొందే వీలుంటుందని మెట్రో పాలిటన్ న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ తెలిపారు. అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా బుధవారం అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. సమాజంలో బలహీన వర్గాలకు న్యాయాన్ని పొందే అవకాశాలు నిరాకరించబడకుండా చూసేందుకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నారని చెప్పారు.ఉచిత సేవలు కావాలనుకునే బాధితులెవరైనా నాంపల్లిలోని అథారిటీస్ కార్యాలయం లేదా పారా లీగల్ వలంటీర్ అనంతరెడ్డిని సంప్రదించాలని సూచించారు.



ప్రగతి నివేదన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, భారీగా హాజరైన ప్రజలు



నీటి సమస్య తీర్చిన ఘనత కేసీఆర్‌దే..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బాలానగర్ డివిజన్‌లో కొనసాగుతున్న పాదయాత్ర

బాలానగర్: కాంగ్రెస్ పాలనలో నీళ్ల లేక మహిళలు కుండలతో ప్రదర్శన చేసేవారని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నియోజకవర్గంలో మంచినీటి సమస్య లేకుండా చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలానగర్ డివిజన్‌లో బుధవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి పాదయాత్ర చేశారు.

- ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. బాలానగర్ డివిజన్‌లో రోడ్లు డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించామన్నారు. నీళ్ల కోసం ఇబ్బందులు పడే బాలానగర్ ప్రజల కోసం వాటర్ ట్యాంక్ నిర్మించి మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. బాలానగర్ ట్రాఫిక్ సమస్యకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించామని తెలిపారు.
- పాదయాత్రలో తనకు చిన్నపాటి డ్రైనేజీ సమస్యల గురించి తెలుస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ సమస్య తలెత్తిందని దీనిని పరిష్కరిస్తామన్నారు. కొత్త పెన్షన్లు త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు బ్యాగ్ కిట్ల పంపిణీ..

బాలానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు బుక్స్, కంపాక్స్ బాక్స్‌లతో కూడిన బ్యాగు కిట్లను తన సొంత నిధులతో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చదువు ఏ వ్యక్తినైనా ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పించామన్నారు. చక్కగా చదువుకొని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. విద్య అనేది నీడ లాంటిదని దానిని మన నుంచి ఎవరూ వేరు చేయలేరన్నారు.

ప్రగతి నివేదన బహిరంగ సభ..

పాదయాత్రలో భాగంగా సాయంత్రం ప్రగతి నివేదన అనే పేరుతో బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చానన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

ఇల్లు కట్టుకునేందుకు రూ.3లక్షలు ఇస్తాం..

- గృహలక్ష్మి పథకంలో ఇల్లు కట్టుకునేందుకు రూ.3లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ఒంటరి మహిళ, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లు అందజేశామని తెలిపారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి వంటి పథకాలు ఎన్నో కుటుంబాలలో వెలుగులు నింపాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు అందజేస్తామన్నారు.

కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాటలు నమ్మొద్దు..

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాటలు నమ్మొద్దని సూచించారు. దిల్‌కుష్‌నగర్‌లో కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా రోడ్డు వేయించానని తెలిపారు. బీజేపీ పార్టీ దేశంలో ఎక్కడైనా నిరుపేద ఆడబిడ్డ పెళ్లికి లక్ష రూపాయలు ఇస్తోందా అని ప్రశ్నించారు. ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఏమైపోయాడో తెలియదన్నారు.

మహిళా బంధు మా అన్న..

దాసరి బస్తీలో పాదయాత్ర చేస్తుండగా డివిజన్ పరిధిలోని స్థానిక మహిళలు ఎమ్మెల్యేను కలిసి తమ మద్దతు ప్రకటించారు. 'మహిళా బంధు మా అన్న కృష్ణారావు'అని మహిళలు కొనియాడారు. మంగళహారతి ఇచ్చి ఆశీర్వదించారు. పనుల నిమిత్తం ఆయన వద్దకు వెళ్లే వారిని ఎంతో ఆదరించే వ్యక్తి అని కొనియాడారు.



పాదయాత్రలో ప్రజలు తెలుపుతున్న సమస్యలను నోట్ చేసుకుంటున్న ఎమ్మెల్యే



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినికి బ్యాగ్ కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే



పాదయాత్రలో యాపిల్ పండ్లను దండగా చేసి ఎమ్మెల్యే మెడలో వేసిన అభిమానులు

సమస్యలపై జెడ్‌సీ సమీక్ష

- విభాగాల వారీగా సమస్యలు తెలుసుకున్న జెడ్‌సీ
- పరిశీలించి చర్యలు తీసుకుంటానని వెల్లడి


కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో శాఖల వారీగా సమస్యలపై జోనల్ కమిషనర్ మమత బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని డిపార్టుమెంట్ల వారిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్ కటింగ్‌కు జలమండలి అధికారులు అనుమతులు కోరారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మమత మాట్లాడుతూ.. దరఖాస్తు పంపితే పరిశీలించి అవసరమైతే మంజూరు చేస్తామన్నారు. ముఖ్యంగా మూసాపేట సర్కిల్‌లోని ఫతేనగర్, కేపీహెచ్‌బీ వార్డుకు సంబంధించిన రోడ్డు కటింగ్‌పై అనుమతులను అడిగారు.

- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. కేపీహెచ్‌బీ నుంచి గాజులరామారం రోడ్డు డివైడర్ వెడల్పు తగ్గించాలని కోరారు.
- జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ వింగ్ అధికారులు మాట్లాడుతూ... విద్యుత్ శాఖ అధికారులు చెట్ల కొమ్మలను కట్ చేసి రోడ్డుపై నుంచి తరలించడం లేదన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే చెట్టు కొమ్మలను తొలగించి వాటికి సంబంధించిన వివరాలు తెలిపితే దానికి అయ్యే ఖర్చును విద్యుత్‌శాఖ నుంచి క్లెయిమ్ చేయవచ్చని తెలిపారు.
- అదే విధంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలన్నారు. రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుపై ప్రతి వారం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
- సర్కిల్ పరిధిలో కూడా సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించుకోవాలని ఉప కమిషనర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు చిన్నారెడ్డి, ఉమాదేవి, అన్ని సర్కిళ్ల ఉప కమిషనర్లు, ఈఈలు, ఏఎంఓహెచ్‌లు, ఏసీపీలు, సీఆర్‌ఎంపీ, ప్రాజెక్టు అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వివిధ విభాగాల అధికారులతో మాట్లాడుతున్న జెడ్‌సీ మమత

వ్యక్తి అదృశ్యం



కసిరెడ్డి వెంకట్‌రెడ్డి (ఫైల్)

సుభాష్‌నగర్: అప్పుల విషయంలో దంపతుల మధ్య జరిగడంతో భర్త ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం మానసారెడ్డి అపార్ట్‌మెంట్‌లో నివాసముండే కసిరెడ్డి వెంకటరెడ్డి కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. కాగా ఇటీవల అప్పులు ఎక్కువగా చేయడంతో ఈ నెల 4వ తేదీన వెంకటరెడ్డితో అతని భార్య స్వప్నం గొడవ పడింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకట్‌రెడ్డి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రైనా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో, స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా అతని ఆచూకీ తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత వస్త్రకళాకు స్పందన

మోతీనగర్: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరిస్తే చేనేత కార్మికులకు చేయూత అందించిన వాళ్లమవుతామని కళాసిల్క్ చేనేత వస్త్రకళా ప్రదర్శన నిర్వాహకులు సంజయ్, వినోద్‌జైన్ పేర్కొన్నారు. ఈ ప్రదర్శన 15వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అదే విధంగా గృహోపకరణాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపాడు. ఈ మేళా ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.



మహాధర్నాకు భారీ జనసమీకరణ చేయాలి

అమీర్‌పేట: డబుల్ బెడ్రూమ్‌ల సమస్యలపై నిర్వహి ంచే మహాధర్నకు పెద్ద సంఖ్యలో జన సమీకరణ చే యాలని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షులు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్ తెలిపారు. బుధవారం అమీర్‌పేట పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల కోసం ధరఖాస్తు చేసుకున్న వారందరిని గుర్తించి నెల 12న ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాకు తరలించాలని పిలుపునిచ్చారు. దరఖాస్తు చేసుకున్న ఎంతో మంది నిరుపేదల ఇళ్ల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వ అందరికి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమర వీరుల కు టుంబ సభ్యులను సత్కరించి మహాధర్నాను ప్రారంభిస్తారని తెలిపారు. సారంగపాణి, కార్పొరేటర్లు సరళ, సుచిత్ర, దీపిక, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

ఆదివాసీ భాషా, సంస్కృతిపై పరిశోధనలు జరగాలి



సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆదివాసీ స్టూడెంట్ ఫోరం (ఏఎస్‌ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ సాగబోయిన పాపారావు అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ హాజరై ఆదివాసీల ఆకుపచ్చ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఆదివాసీ భాషా, సంస్కృతిపై విస్తృతంగా పరిశోధనలు జరగాలన్నారు. ప్రొ.అప్కా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో వెనుకబడిన వాదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నేడు హరిహర కళాభవన్‌లో జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి రాష్ట్ర గవర్నర్ తమిళి సై హాజరవుతారని విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. అంతకు ముందు ఎన్‌సీసీ గేటు నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు ఆదివాసీల సాంప్రదాయ గుసాడి, డోలు నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎఫ్ ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు మడావి అజయ్, పూనెం వివేకవర్ధన్, అధ్యాపకులు అనురాధ, కిశోర్, ఏఈడబ్ల్యూసీపీ జాతీయ అధ్యక్షులు గొంది వెంకటరమణ, మహిళా చైతన్య శక్తి రాష్ట్ర మహిళ నేత వెంకటరమణచ పాల్గొన్నారు.

మేడ్చల్‌లో ప్రామాణికంగా వ్యవసాయ గణన

ముఖ్య ప్రణాళిక శాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకులు సౌమ్య

సాక్షి, మేడ్చల్ జిల్లా: వ్యవసాయ గణన ప్రతి ఐదేళ్లకోసారి ఒకసారి మూడు దశల్లో జరుగుతుందని, ప్రస్తుతం ఈ గణన మేడ్చల్ జిల్లాలో 2021–22ను ప్రామాణిక సంవత్సరంగా తీసుకొని నిర్వహిస్తున్నట్లు ముఖ్యప్రణాళిక శాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకులు సౌమ్య తెలిపారు. బుధవారం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో వ్యవసాయ గణన 2021–22 సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, డివిజనల్, మండల గణాంక, అర్థ గణాంక శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ వ్యవసాయ గణన సమాచారాన్ని రాష్ట్రస్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు, సాంఘిక, ఆర్థిక విధాన రూపకల్పనకు అనేకమంది అనేక స్థాయిల్లో ఉపయోగిస్తారన్నారు. కమతాలు స్వరూప స్వభావాల వారీగా, పరిమాణ తరగతుల వారీగా కమతాల సంఖ్య, వాటి విస్తీర్ణం, భూవినియోగం, వనరుల వారీగా నీటిపారుదల విస్తీర్ణం, కౌలు వివరాలు వంటి సమాచారాన్ని డిజిటల్ పరికరాల ద్వారా సేకరించి, నమోదు చేయాలని ఆమె పేర్కొన్నారు. ప్రాముఖ్యత కలిగిన ఈ సమాచారాన్ని సమగ్రంగా సేకరించాలని ఆదేశించారు.

'ఎన్నికల్లో బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు'



నేతాజీకాలనీలో అధికారులతో పర్యటిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కృష్ణారావు చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బీజేపీ నేతలు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ధ్వజమెత్తారు. బుధవారం ఆయన వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని నేతాజీకాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక టెంపుల్ వరకు 900 డయా పైపులు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రెండు రోజుల్లో పైపులు నేతాజీ కాలనీకి వస్తాయని తెలిసి కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఫతేనగర్ డివిజన్‌పై బీజేపీ నేతలు జీర్ణించుకోలేక అసత్యపు ఆరోపణలు చేయటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ పవన్, రామ్‌నర్సయ్య, కంచిస్వామి, కంచి రాజ్‌కుమార్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో హరితహారం

బాలానగర్: వాతావరణంలోని కాలుష్యాన్ని కట్టడి చేయడానికి, ఆరోగ్యవంతమైన జీవనానికి విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కాలేజీ ప్లే గ్రౌండ్‌లో, క్లాస్‌రూమ్ కాంప్లెక్స్, సిట్ ఎదురుగా స్థలంలో సుమారు 100 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, బలరాం నాయక్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూలో మొక్కలతో ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలి



కూకట్‌పల్లి డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దేవినగర్, కేరళకాలనీ, గాయత్రినగర్‌లో ప్రజా సమస్యలపై అన్ని విభాగాల అధికారులతో కలిసి బుధవారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాదయాత్ర చేశారు. దేవినగర్‌లో నూతనంగా వేసిన రోడ్డుని పరిశీలించారు. గాయత్రినగర్‌లో రోడ్డు పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిధులు మంజూరు చేశారన్నారు. త్వరగా రోడ్డు నిర్మాణం ప్రారంభించాలని ఏఈని ఆదేశించారు. అదే విధంగా కేరళకాలనీలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్, వాటర్ ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరేష్, ఆర్‌పీ వినయ్‌కాంత్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్య, వీధిలైట్ల సూపర్‌వైజర్ భద్రయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిధుల్లో సింహభాగం సీసీ కెమెరాలకే

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



పోలీసు అధికారులతో చర్చిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: సీసీ కెమెరాల ప్రాధాన్యం గుర్తించి తన నియోజకవర్గ అభివృద్ధి నిధులలో అత్యధిక శాతం సీసీ కెమెరాల ఏర్పాటుకు కేటాయిస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం సచివాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నూతన సీసీ కెమెరాల ఏర్పాటు అంశంపై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల పర్యవేక్షణ, నేర నియంత్రణలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటులో దేశంలో హైదరాబాద్ నగరం ప్రథమ స్థానంలో ఉందన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో వందశాతం సీసీ కెమెరాల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి గతేడాది రూ.84 లక్షలను కేటాయించగా, ఈ ఏడాది రూ.50 లక్షలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నార్త్ జోన్ డీసీపీ చందనా దీప్తి, మహంకాళి, బేగంపేట, ఎస్‌ఆర్‌నగర్, గాంధీనగర్ ఏసీపీలు రవీందర్‌యాదవ్, రామలింగరాజు, చంద్రశేఖర్, రవికుమార్, సీఐలు రాంప్రసాద్, పరశురాం, రవి పాల్గొన్నారు.

ఇళ్ల ఫ్రీ హోల్డ్‌కు మంత్రికి వినతి..

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ పరిసర ప్రాంతాల్లో లీజ్ ల్యాండ్ ఇళ్లను ఫ్రీ హోల్డ్ చేయాలని బుధవారం స్థానిక బస్తీ, కాలనీ వాసులు మంత్రి తలసానికి వినతిపత్రం ఇచ్చారు. ఎన్నో ఏళ్ల నుంచి నిరుపేద వర్గాలకు చెందిన అనేక కుటుంబాలు ఇక్కడ జీవనం సాగిస్తున్నాయని, అయితే ఇళ్లు ఇంత వరకు ఫ్రీ హోల్డ్ కాలేదన్నారు. బోయిగూడ కేస్ బ్లాక్, సున్నంబట్టీ, బొక్కలగూడ ప్రాంతాల్లో సుమారు 142 ఇళ్లు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి నుంచి జీవనం సాగిస్తున్న ప్రజలకు మేలు చేయడానికి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. జీరా తరహా మీ ఇళ్లు కూడా ఫ్రీ హోల్డ్ అవుతాయని చెప్పారు.

ప్రారంభోత్సవానికి రెడీ

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ నిర్మాణం పూర్తి
- ప్రజలతో కలిసి మాట్లాడేలా ప్రత్యేక ఏర్పాట్లు
- ఎమ్మెల్యే సిబ్బందికి ప్రత్యేక క్యాబిన్లు
- పై అంతస్తులో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యాలయం

కూకట్‌పల్లి: అత్యాధునిక సౌకర్యాలతో పాటు సర్వహంగుల కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని నిర్మించారు. వచ్చే నెలలో దీనిని ప్రారంభించనున్నారు. జాతీయ రహదారికి సమీపంలో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా క్యాంపు కార్యాలయాన్ని నిర్మించారు. 1 కోటి 63 లక్షలతో నిర్మించిన ఈ క్యాంపు కార్యాలయంలో రెండు అంతస్తులు ఉన్నాయి. క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలను తెలియజేసేందుకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సర్టిఫికెట్ల కోసం పూర్తి సమాచారాన్ని ఇచ్చేందుకు మరో సెల్ ఏర్పాటు చేశారు.

– ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని సమస్యలను స్వీకరించి ఎమ్మెల్యేకు నేరుగా అందజేసే విధంగా మరో క్యాబిన్ తీర్చిదిద్దారు. ఎమ్మెల్యేను కలిసి వారి సమస్యలను తెలియజేసుకునే వారికి సౌకర్యవంతంగా హాలును ఏర్పాటు చేశారు. అదే విధంగా సోషల్ మీడియా, పర్సనల్ సెక్రటరీలకు కూడా ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. పై అంతస్తులో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యాలయం ఉంటుంది. ఈ విధంగా సర్వహంగులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రూపుదిద్దుకుంది. ఈ సందర్భంగా ప్రతి రోజూ ఎమ్మెల్యే రెండు గంటల పాటు సందర్శకుల కోసం వేచి ఉంటారు.



కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

అందరికీ అందుబాటులో..



ఏ నియోజకవర్గంలో లేని విధంగా నిత్యం ప్రజలకు అందుబాటులో మా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఉంటారు. నియోజకవర్గ ప్రజలకు మరింత సేవలు అందించేందుకు కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా ఇక్కడి వచ్చి చెబితే సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అవుతుంది.

– జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి కార్పొరేటర్